## హరితవనం బుగ్గి

### పటాకులు కాల్చడంతో కాలిపోయిన మొక్కలు, గడ్డి
### కొత్తగూడెం కాంగ్రెస్ ర్యాలీలో కార్యకర్తల అత్యుత్సాహం


హరితవనంలో మంటలు ఆర్పుతున్న స్థానికులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 11 : యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పటాకులు పేల్చడంతో ప్రమాదవశాత్తు హరితవనంపై పడి కాలిపోయిం ది. ఈ ఘటన కొత్తగూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ యువజన కాంగ్రెస్ నాయకుడి రాకతో కార్యకర్తలు ప్రధా న రహదారిపై పటాకులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ క్రమంలో కాలుతున్న పటాకులు అంబేద్కర్ సెంటర్‌లోని హరితవనంపై పడడంతో ఒక్కసారిగా గడ్డి, మొక్కలకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. దీనిపై 'సేవ్ కొత్తగూడెం-సేవ్ మున్సిపాలిటీ' కన్వీనర్ జలాల్ స్పందిస్తూ.. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో డివైడర్లకు అడ్డుగా ఫ్లెక్సీలు కట్టడమే కాకుండా పటాకులు పేల్చి హరితవనం కాలిపోవడానికి కా రకులైన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న కూడలిలో పటాకులు కాల్చేందుకు అనుమతి ఇవ్వడం సరికాదని, అనుమతి లేకుండా కాల్చిన వారిపై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## అత్తను కత్తితో పొడిచిన అల్లుడు

పినపాక, ఏప్రిల్ 11: తన భార్యను కాపురానికి పంపడం లేదని, ఇస్తానన్న డబ్బులు కూడా ఇవ్వడం లేదని కక్ష పెంచుకున్న ఓ వ్యక్తి.. తన అత్తను కత్తితో పొడిచాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఏడూళ్లబయ్యారం గ్రామస్తుడు అరవ బాబు, ఇదే గ్రామంలోని గుండు నాగశ్రీ.. మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఓ బాబు ఉన్నాడు. ఏడాదిన్నర నుంచి ఈ దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె తన భర్తను వదిలేసి, బిడ్డ సహా పుట్టింటికి వెళ్లి, తిరిగి రావడం లేదు. తన భార్యను కాపురానికి పంపించడం లేదన్న కోపంతోపాటు గతంలో తనకు ఇస్తానన్న డబ్బులు ఇవ్వడం లేదని అత్తపై అతడు కక్ష పెంచుకున్నాడు. బంధువుల ఇంట్లో గురువారం రాత్రి భోజనం చేస్తున్న తన అత్త నాగలక్ష్మిపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను బంధువులు వెంటనే భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. భర్త బాబుపై పోలీస్ స్టేషన్‌లో నాగశ్రీ ఫిర్యాదు చేసింది.

## పోలీస్ స్టేషన్ తనిఖీ

ములకలపల్లి, ఏప్రిల్ 11: స్థానిక పోలీస్ స్టేషన్‌నుఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎస్సై రాజశేఖర్‌తో, సిబ్బందితో మాట్లాడారు. డీఎస్పీ సతీష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాల్వంచ/ పాల్వంచ రూరల్/ చుంచుపల్లి, ఏప్రిల్ 11: పాల్వంచ పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో, చుంచుపల్లి మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఫీడర్ల మరమ్మతుల రీత్యా ఇందిరాకాలనీ సబ్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, యానంబైలు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, చుంచుపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు వివరించారు.

## కాంగ్రెస్ దళిత నాయకుడికి అవమానం!

### రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టు
### సొంత పార్టీపైనే అసహనం వ్యక్తం చేసిన గడ్డం రాజశేఖర్


పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసిన గడ్డం రాజశేఖర్

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 11: కాంగ్రెస్ యువజన విభాగానికి చెందిన దళిత నాయకుడికి తీరని అవమానం జరిగింది. తమ పార్టీ నాయకుడి పర్యటనకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేయడంపై సోషల్ మీడియా వేదికగా బాధితుడు అసహనం వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. వివరాలిలా ఉన్నాయి. జిల్లా పర్యటనలో భాగంగా కాంగ్రెస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రమైన కొత్తగూడేనికి చేరుకున్నారు. అయితే, కొత్తగూడేనికి చెందిన కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా నాయకుడైన దళితుడు గడ్డం రాజశేఖర్ ఈ పర్యటనకు హాజరయ్యేందుకు సమాయత్తమయ్యారు. అయితే, అనూహ్యంగా దళితుడైన రాజశేఖర్‌ను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. 'పార్టీలో దశాబ్దాలుగా పనిచేసిన నన్ను – అదే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముందస్తు అరెస్టు చేయడం దారుణం. ఇది ఒక దళిత నాయకుడిపై వివక్షతో కూడిన చర్య – నేను తీవ్రంగా ఖండిస్తున్నాను' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అరెస్టు ఎవరి ప్రోద్బలంతో జరిగిందో తనకు తెలియదని, కానీ కాంగ్రెస్‌లో దళితుల పట్ల వివక్షను మాత్రంది ఇది చాటిచెప్పేలా కనిపిస్తోందని అన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE

★Jangaon DTCP Open Plots Reasonable Price, Clear Title, Prime Location by: SSVPD'S. 7382126789.
NT-329249

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 11: మండలంలోని రాజాపురంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. సన్న బియ్యం లబ్ధిదారుడు నాగయ్య ఇంట్లో సహపంక్తి భోజనం చేశారు. డీసీవో సయ్యద్ ఖుర్షీద్, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో మహాలక్ష్మి, ఏవో అనూష పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

టేకులపల్లి, ఏప్రిల్ 11: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభల ప్రచార పోస్టర్‌ను జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు శక్రువారం టేకులపల్లిలో ఆవిష్కరించారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఖమ్మంలో ఈ మహాసభలు ఉంటాయన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616





భద్రాచలం: జ్యోతీరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు, రేగా, కొత్తగూడెం సింగరేణి: సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాం, జూలూరుపాడు: నివాళులర్పిస్తున్న నాయకులు, పాల్వంచలో కేటీపీఎస్ అధికారులు


అశ్వారావుపేట: జ్యోతీరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

## సమ సమాజ 'జ్యోతి'కి ఘన నివాళి

భగభగమంటూ, ధగధగమంటూ వెలుగుతున్న జ్యోతి.. తన చుట్టూ ఉన్న చీకటిని పారదోలుతుంది. అందరికీ వెలుగు ప్రసాదిస్తుంది. కొన్ని శతాబ్దాల క్రితం.. చీకటిమయంగా ఉన్న మన సమాజంలో ఓ 'జ్యోతి'ని వెలిగించి, వెలుగులను నింపి, చీకటిని పారదోలిన ఓ మహనీయుడిని మనం ఇప్పటికీ స్మరిస్తున్నాం.. వినమ్రంగా నివాళులర్పిస్తున్నాం. ఆ మహనీయుడే.. మన జ్యోతీరావు పూలే..! ఆయన పేరులోనే వెలుగు (జ్యోతి) ఉంది. వివక్షాపూరిత వర్ణ వ్యవస్థకు, కులోన్మాదానికి, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. బాలికలు తప్పనిసరిగా చదువుకోవాలన్న నినాదంతో వారి కోసం దేశంలోనే మొట్టమొదటి పాఠశాలలను తన జీవిత భాగస్వామి సహకారంతో నెలకొల్పారు. ఆ మహనీయుడి జయంతిని జిల్లాలోని ఆలోచనాపరులు, అభ్యుదయవాదులు తదితరులు అనేకమంది శుక్రవారం వేడుకగా జరుపుకున్నారు. సమ సమాజ స్థాపన దిశగా ఆనాడు ఆయన వేసిన పునాదులను స్మరించుకున్నారు. వినమ్రంగా నివాళులర్పించారు.

– 'నమస్తే' నెట్‌వర్క్, ఏప్రిల్ 11:


ఇల్లెందు రూరల్: నివాళులర్పిస్తున్న సింగరేణి ఏరియా జీఎం కృష్ణయ్య






చర్ల: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, మణుగూరు టౌన్: బీఆర్ఎస్ కార్యాలయంలో, దమ్మపేట: నివాళులర్పిస్తున్న నాయకులు, బూర్గంపహాడ్: పూలేకు నివాళి అర్పిస్తున్న బీసీ నాయకులు, కరకగూడెంలో..

## 'చలో వరంగల్' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరించిన రేగా కాంతారావు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 11: ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు శుక్రవారం మణుగూరులోని కార్యాలయంలో ఆవిష్కరించారు. నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, నూకారపు రమేష్, వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'భగీరథ' నీటి సరఫరాకు అంతరాయం

ఇల్లెందు, ఏప్రిల్ 11: ఇల్లెందులో మిషన్ భగీరథ మోటర్లు, పంపుల మరమ్మతుల కారణంగా రెండు రోజులపాటు మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుదని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ శుక్రారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం

### జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా


అవగాహన కల్పిస్తున్న డీడబ్ల్యూవో స్వర్ణలత లెనీనా

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 11: పోషకాలున్న ఆహారం తీసుకుంటేనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమాధికారి (డీడబ్ల్యూవో) స్వర్ణలత లెనీనా అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన పోషణ పక్వాడా కార్యక్రమానికి ఆమె హాజరై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. రెండేళ్లలోపు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లల బరువు, ఎత్తు వంటివి నిత్యం పరిశీలించాలన్నారు. సీడీపీవో లక్ష్మీప్రసన్న, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

## టైలర్లకు విద్యార్థుల యూనిఫాం క్లాత్ అందజేత


పాల్వంచ: యూనిఫాం క్లాత్ అందజేస్తున్న అధికారులు

పాల్వంచ/ పాల్వంచ రూరల్, ఏప్రిల్ 11: 2025–26 సంవత్సరంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టే క్లాత్‌ను సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ (ఎస్‌హెచ్‌జీ) టైలర్లకు ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంఈవో శ్రీరామ్మూర్తి శుక్రవారం అందజేశారు. మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని 79 ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు మొదటి విడత యూనిఫామ్ క్లాత్‌ను వారికి అప్పగించారు. పాఠశాలల ప్రారంభానికి ముందు డ్రెస్‌లు కుట్టి అందించాలని టైలర్లను అధికారులు కోరారు. కార్యక్రమంలో శ్రావణి, రాజశేఖర్, శ్రీనివాస్ చందర్‌లాల్, కిషన్, గంగరాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు వసంతోత్సవం


వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 11: భద్రాచలం రామాయలంలో సీతారామ చంద్రస్వామికి అర్చకులు శుక్రవారం వసంతోత్సవం నిర్వహించారు. బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం చక్రతీర్థం, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. శ్రీ పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయి.

పర్ణశాల, ఏప్రిల్ 11: శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు శుక్రవారం స్వామి వారికి వసంతోత్సవం నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన


అశ్వాపురం: శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

అశ్వాపురం/పినపాక/కరకగూడెం/మణుగూరు టౌన్, ఏప్రిల్ 11: అశ్వాపురం, పినపాక మండలాల్లోని వివిధ గ్రామాల్లో బీటీ రోడ్లకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. మణుగూరు మండలం కూనవరం గ్రామంలో వంక శివలక్ష్మి ఇంటిలో సన్న బియ్యంతో చేసిన భోజనం భుజించారు. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బందికి కంటి పరీక్షలు


కంటి పరీక్ష చేయించుకుంటున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు, ఏప్రిల్ 11: ఇల్లెందు పోలీస్ సబ్ డివిజన్‌లోని అధికారులకు, సిబ్బందికి, వారి కుటుంబీఉలకు కంటి వైద్య శిబిరాన్ని ఖమ్మంలోని శరత్ మ్యాక్స్ విజన్ వైద్యులు శుక్రవారం స్థానిక అయితా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. దీనిని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను ప్రారంభించారు. డాక్టర్ శరత్, డాక్టర్ నరేందర్, సిబ్బంది వైద్య సేవలందించారు. సీఐలు బత్తుల సత్యనారాయణ, రవీందర్, తాటిపాముల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


అశ్వారావుపేట టౌన్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 11: గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపునకు నిరసనగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సీపీఐ–ఎంఎల్ (మాస్‌లైన్) నాయకులు శుక్రవారం స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శిగోకినపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్రం పెంచిన చమురు ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోకినపల్లి ప్రభాకర్, వాసం బుచ్చిరాజు, కుంజ అర్జున్‌రావు, జె.శ్రీనివాస్, మహేశ్వరరావు, పొదిలి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లెందులో..**

ఇల్లెందు, ఏప్రిల్ 11: స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సారయ్య మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వంట గ్యాస్‌పై రూ.50 పెంచి పేద మధ్య తరగతి కుటుంబాలపై పెనుభారం వేసిందన్నారు. కార్యక్రమంలో దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, ఐలయ్య, బాస శీను, కుమ్మరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుతో శాపం.. బాధితులకు కోపం


రోడ్డుపై నిలబడిన గ్రామస్తులు

టేకులపల్లి, ఏప్రిల్ 11: ఈ ఫొటో చూశారు కదా..! అక్కడక్కడ కంకర పోసినట్లుగా ఉన్న ఇది.. మండలంలోని తావుర్యాతండా పంచాయతీలోగల కోక్యాతండాలోని రోడ్డు. మూడేళ్ల క్రితం ఈ రోడ్డు నిర్మాణాన్ని అధికారులు మొదలుపెట్టి వదిలేశారు. అప్పటి నుంచి ఇది ఇలాగే ఉంది. తమపాలిట శాపంగా మారిన ఈ రోడ్డును ఇలాగే వదిలేయడంతో బాధితులైన ఆ తండా వాసులకు కోపం వచ్చింది. వారు శుక్రవారం ఇలా రోడ్డెక్కి, నిర్మాణాన్ని పూర్తిచేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గుర్తుతెలియని వృద్ధుడు మృతి

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 11: గుర్తుతెలియని ఓ వృద్ధుడు బస్ షెల్టర్‌లో మృతిచెందిన ఘటన లక్ష్మీదేవిపల్లి మండలం మైలారంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మైలారం బస్ షెల్టర్ వద్ద గుర్తుతెలియని ఓ వృద్ధుడు గురువారం స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. అతడిని మైలారం పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతిచెందినట్లు ఆసుపత్రి వైద్యుడు తెలిపారు. ఆ వృద్ధుడు కొంతకాలంగా మైలారం పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని, అతడి వివరాలు తెలియవని గ్రామస్తులు తెలిపారు.

## గాలిదుమారంతో నేలకూలిన భారీ వృక్షం

పాల్వంచ, ఏప్రిల్ 11: పాల్వంచ గాంధీనగర్ ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో వందేళ్ల పాల చెట్టు నేలకూలింది. గురువారం అర్ధరాత్రి వచ్చిన గాలి దుమారం కారణంగా ఈ చెట్టు కూలి దేవాలయానికి, ఆ పక్కనే ఉన్న ఓ ఇంటికి మధ పడింది. దీంతో ఆ రేకుల ఇల్లు ధ్వంసమైంది. చెట్టుకొమ్మ పడడంతో అందులో నిద్రిస్తున్న మహిళ కాంపాటి సుకనమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. పాల్వంచ పోలీసులు, ఆర్ఐ రవికుమార్, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ్, యాసిన్‌లు శుక్రవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## మేకల మందలోకి దుప్పి పిల్ల


దుప్పి పిల్లను స్వాధీనపర్చుకున్న అధికారులు

దమ్మపేట, ఏప్రిల్ 11: దుప్పి పిల్ల.. దారి తప్పి, మేకల మందలోకి వచ్చింది. మండలంలోని పెద్ద గొల్లగూడెం గ్రామానికి చెందిన కొందరు మేకల కాపరులు.. మేకల మందలో దుప్పి పిల్ల కలవడాన్ని శుక్రవారం గమనించారు. వీరు ఇచ్చిన సమాచారంతో దమ్మపేట ఫారెస్ట్ రేంజర్ ఎ.కరుణాకరాచారి, సిబ్బందితో వెంటనే పెద్దగొల్లగూడెం వెళ్లారు. దుప్పిని స్వాధీనపర్చుకుని, కిన్నెరసాని అభయారణ్యానికి తరలించారు.

## అమ్మలకు పోషకాహారం.. బిడ్డలకు ఆయురారోగ్యం..!




టేకులపల్లి: మాట్లాడుతున్న సీడీపీవో తార, అశ్వారావుపేట: పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ, అన్నపురెడ్డిపల్లి: సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీవో సలోమి

టేకులపల్లి, ఏప్రిల్ 11: ''అమ్మలు (బాలింతలు) కనీసం వెయ్యి రోజులపాటు (మూడు సంవత్సరాల మూడు నెలల పాటు) పోషకాహారాన్ని తీసుకుంటే.. వారి బిడ్డలు సంపూర్ణ ఆయురారోగ్యంతో ఉంటారు'' అని, సీడీపీవో మంగతార చెప్పారు. మండలంలోని బేతంపుడి పంచాయతీ వెంకట్యా తండా అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని సెక్టార్ సూపర్‌వైజర్ కె.అనురాధ నిర్వహించారు. సీడీపీవో మంగతార మాట్లాడుతూ.. చిరు ధాన్యాల్లో చక్కటి పోషకాలు ఉంటాయన్నారు. ఈ ధన్యాలతో చేసిన ఆహారం తీసుకోవాలన్నారు. ఈ ఆహారం తయారీపై అవగాహన కల్పించారు. పిల్లలకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమానికి గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు హాజరయ్యారు. అంగన్‌వాడీ టీచర్లు సుగుణ, లలిత కుమారి, అరుణకుమారి, వెంకటనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

**ఖర్చు తక్కువ.. పోషకాలు ఎక్కువ**

అశ్వారావుపేట, ఏప్రిల్ 11: తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేందుకు ఏకైక మార్గం.. పోషకాహారం తీసుకోవడమే.


కరకగూడెం: చిరు ధాన్యాల ప్రదర్శన

తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న చక్కటి ఆహారం చిరుధాన్యాలతోనే సాధ్యం'' అని, సీడీపీవో ముత్తమ్మ చెప్పారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారంలో అధిక పోషకాలు ఉంటాయన్నారు. పోషణ పక్షంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరు ధాన్యాలు, ఆకు కూరలను ప్రదర్శించారు. వాటి ప్రాముఖ్యతను వివరించారు. పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పోషణ అభియాన్ కో–ఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

**కరకగూడెంలో..**

కరకగూడెం, ఏప్రిల్ 11: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ కరకగూడెం సెక్టర్ సూపర్‌వైజర్ భద్రమ్మ నిర్వహించారు. చిరు ధాన్యాలతో కూడిన ఆహారంలో ఉండే పోషకాలను, వీటితో కలిగే ప్రయోజనాలను బాలింతలకు, గర్భిణులకు వివరించారు. చిన్నారులకు ప్రతి రోజూ బాలామృతం అందించాలన్నారు. చిరు ధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించి, వాటి ప్రయోజనాలను వివరించారు. ఏపీఎం త్రిగుణ, అంగన్‌వాడీ టీచర్లు భవాని, మంగతాయారు, పద్మ, స్వరూప, ఆయాలు పాల్గొన్నారు.

**అన్నపురెడ్డిపల్లిలో..**

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 11: మండలంలోని ఎర్రగుంట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు శ్రీమంతాలను ఐసీడీఎస్ సీడీపీవో సలోమి నిర్వహించారు. సూపర్ వైజర్ అరుణ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.